ఆ వర్సిటీల గుర్తింపును రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వివాద స్థలంలోని ప్రైవేటు యూనివర్సిటీల గుర్తింపును రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి, కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాజకీయ పలుకుబడితో పైరవీలు చేసిన వారికి ఇష్టారాజ్యంగా ప్రైవేటు వర్సిటీలను కట్టబెట్టారని ఆరోపించారు. ఇళ్ల స్థలాల కింద నమోదైన వివాదాస్పద భూముల్లో ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతి ఇచ్చారని, వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విలీనానికి ముందే స్పష్టత కోరాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరుశరామ్

కంటోన్మెంట్: జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనానికి ముందే ఉద్యోగుల భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలని కంటోన్మెంట్ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి, బీజేపీ నేత పరుశరామ్ అన్నారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ముఖ్యంగా 13 ఏళ్లుగా కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలు చేపట్టలేదని, తక్షణమే పూర్తిస్థాయి నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. అంత్యంత దుర్భర పరిస్థితుల్లో కంటోన్మెంట్‌లో పనిచేస్తూ, ఉద్యోగ జీవితం పూర్తి కాకుండానే 125 మంది మరణించడం పట్ల మానవతా దృక్పథంలో ఆలోచించాలని విన్నవించామన్నారు. 5 శాతం నిబంధనల ఎత్తివేతపై సానుకూలంగా స్పందించే అవకాశముందన్నారు. హస్మత్‌పేట, తుర్కపల్లిలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు స్థలాలను కంటోన్మెంట్ సిబ్బంది ఇళ్ల స్థలాల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నామని విలీనానికి ముందే ఇళ్ల స్థలాల కేటాయించాలన్నారు.

'గురుకుల టైమ్ టేబుల్ యాంత్రిక జీవితానికి నిదర్శనం'

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకులాల్లో విద్యార్థుల టైమ్ టేబుల్ యాంత్రిక జీవితానికి నిదర్శమని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీజీ-ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చిన్న వయస్సు గల విద్యార్థులు నిరంతరం పని చేయడం కష్టతరమన్నారు. చదువులతో పాటు ఆరోగ్యం, పౌష్టికాహారం, విశ్రాంతి, నిద్ర, క్రీడలు కూడా ముఖ్యమన్నారు. గురుకుల టైమ్ టేబుల్‌ను బలవంతంగా రుద్దకుండా సవరించాలని కోరారు.

టీజీ-పీఎస్సీ ముట్టడికి మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు (5న) టీజీ-పీఎస్సీ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంపు, డీఎస్సీని వాయిదా, 25000 పోస్టులతో మెగా డీఎస్సీని, రూ.4000 నిరుద్యోగ భృతి, 46 జీవో రద్దు, ఉద్యోగాలకు జాబ్ కేలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మా ఇల్లు-పోషకాహార హరివిల్లు

పోషకాహార విజ్ఞానంపై ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ విస్తృత ప్రచారం



తార్నాకలోని ఎన్ఐఎన్

లాలాపేట: మా ఇల్లు పోషకాహార హరివిల్లు పేరుతో సూక్ష్మ పోషకాలు-ఉపయోగాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తోంది. ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) పోషకాహార విజ్ఞానాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల ఎన్ఐఎన్ ఓ ప్రత్యేకమైన బ్రోచర్‌ను రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత అర్థమయ్యేలా ఆంగ్లంతో పాటు తెలుగు భాషలో సైతం దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆహార వైవిధ్య స్కోర్స్ ఆధారంగా కేంద్రీకృత పోషణ విద్యను అందించి గ్రామీణ ప్రాంతాల్లో అక్కడి కుటుంబాలు సూక్ష్మ పోషకాలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకునేలా ప్రజల్ని ప్రోత్సహించడం ఈ బ్రోచర్ ప్రధాన ఉద్దేశం.



ఇందులో మానవ శరీరంలో కీలక పాత్ర పోషించే సూక్ష్మ పోషక పదార్థాలు, విటమిన్లు, మానవ శరీరానికి విటమిన్-ఏ అవసరం, విటమిన్-డీ, ఎర్రరక్త కణాల తయారీకి అవసరమైన ఫోలెట్ అండ్ విటమిన్-బీ12, శరీర పనితీరుకు కావాల్సిన విటమిన్-సీ ఆవశ్యకత, హిమోగ్లోబిన్ తయారికి అవసరమైన ఐరన్ లభించే ఆహారాలు, శరీరంలో ఎముకల దృఢ నిర్మాణానికి కావాల్సిన క్యాల్షియం లభ్యత, శరీర పెరుగుదల, జీవక్రియల క్రమబద్ధీకరణకు అయోడిన్ పాత్ర, రెండు రకాలైన మోనో శాచ్యురేటెడ్ ఫ్యాట్స్, పాలీ శాచ్యురేటెడ్ ఫ్యాట్స్, వంట వంట పద్ధతులు, పరిశుభ్రత తదితర అంశాలను ఈ బ్రోచర్‌లో అందమైన రంగు రంగుల చిత్రాలతో సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రూపొందించారు. మనం నిత్యం తీసుకునే భోజనంలో పిండి పదార్థాలు, ప్రోటీన్లు, మాంసకృతులు, విటమిన్లు, ఖనిజాలు సరైన పాలల్లో ఉండే సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

మొక్కలు నాటేద్దాం.. బతికిద్దాం

- వన మహోత్సవానికి సిద్ధం
- 50 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికలు
- ఏర్పాట్లు చేస్తున్న బేగంపేట సర్కిల్ అధికారులు


బేగంపేట సర్కిల్‌లోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

సనత్‌నగర్: వన మహోత్సవానికి అధికారులు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం వన మహోత్సవంగా పేరు మార్చింది. ఆ మేరకు అధికార యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బోనాల జాతర ప్రారంభంతోనే మొక్కలు నాటే మహోత్తర యజ్ఞం ఆరంభం కానుంది. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే బేగంపేట సర్కిల్‌లో ఈ యేడు 50 వేల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ మేరకు సర్కిల్ పరిధిలోని బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్ల వ్యాప్తంగా ఎక్కడెక్కడ మొక్కలు నాటాలనే దానిపై ఇప్పటికే అధికారులు అంచనాకు వచ్చారు. ముఖ్యంగా బేగంపేట సర్కిల్‌లో ఖాళీ స్థలాలంటూ లేవు. అయితే ప్రస్తుతం ఉన్న పార్కుల్లో వాటి ప్రహరీలకు ఆనుకుని చిన్న చిన్న మొక్కలను నాటాలని నిర్ణయించారు. అలాగే సర్కిల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల ప్రాంగణాలపై దృష్టి సారించి అక్కడ మరింత పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోనున్నారు. దీనికి తోడు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పలుచోట్ల ఆక్రమణలను తొలగించగా ఆయా చోట్ల కూడా మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. మెక్లెన్‌గూడ, చుట్టలబస్తీ, పీజీ కళాశాల, వెస్లీ కాలేజ్, బన్సీలాల్‌పేట డి-క్లాస్, హమాలీబస్తీ..ఇలా గుర్తించిన ప్రాంతాల్లో మొక్కలు విరివిగా నాటనున్నారు. ఈ నెల 8 తర్వాత జిల్లా మంత్రి, మేయర్ తదితర ప్రముఖులచే వన మహోత్సవానికి శ్రీకారం చుట్టనున్నారు.

నర్సరీల్లో సిద్ధం..

బేగంపేట సర్కిల్‌లో మొక్కలు నాటేందుకు ఇప్పటికే పలు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశారు. జూబ్లీ బస్టాండ్ ఎదురుగా, మోండా మార్కెట్ దిల్‌దార్‌కాలనీ లేఅవుట్, ఇందిరాపార్కు తదితర ప్రాంతాల్లోని నర్సరీల నుంచి మొక్కలను తీసుకురానున్నారు. అల్లనేరేడు, వేప, కానుగ, రావి, మర్రి, ఫైకస్, నెమలినార, చిన్నబాదం, గుల్‌మొహర్, తబూబియా రోజీ, స్పాటిడియా, మహాగని కొడంబ తదితర విభిన్న రకాలు, విభిన్న జాతులకు చెందిన పూలు, పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచారు. పెద్ద చెట్లతో పాటు చిన్న చిన్న మొక్కలు ఆయా నర్సరీల్లో కొలువుదీరాయి.

ఖాళీ స్థలాలపై దృష్టి..

బేగంపేట సర్కిల్‌లో 50,000 మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అయితే నాటిన మొక్కలను బతికించాలన్నదే ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నారు. గతంలో ఇబ్బడిముబ్బడిగా మొక్కలు నాటినా అవి ఏ మేర బతికాయో కూడా తెలియని పరిస్థితులు. గతేడాది లక్ష్యం బారెడు అయితే..నాటింది మూరెడే అన్న అపవాదు ఉంది. ఎందుకంటే గత సంవత్సరం ఎన్నికల హడావిడి ప్రారంభం కావడంతో మొక్కలు నాటడంపై అధికారులు అంతగా దృష్టి సారించలేదనే చెప్పాలి. అదీ కాకుండా మొక్కలు నాటి, వాటి పరిరక్షణ బాధ్యతలు తీసుకునేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురావడం లేదు. ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలంటే ముఖ్యంగా ఖాళీ స్థలాలు లేకపోవడం, వాటికి ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయడం కష్టతరంగా కూడుకున్నది కావడం, నీరు పోసేందుకు ట్యాంకర్లను సమకూర్చడం వంటివి భారంగా పరిణమించడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి కనబరచడం లేదు.

సంక్షేమ సంఘాలతో కలిసి..

ఈ యేడు కూడా అదే పరిస్థితి నెలకొనడంతో యూబీడీ విభాగానికి చెందిన వారే స్థానికంగా ఉన్న పలు సంక్షేమ సంఘాలతో కలిసి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలనే బలమైన సంకల్పం పెట్టుకున్నారు. అయితే లక్ష్యాన్ని చేరువ చేసే దిశగా నాటిన మొక్కలను కాపాడుకోవాలనే దాని పైనే ప్రధానంగా దృష్టి సారించారు. 4-5 వేల వరకు పెద్ద మొక్కలు, 20-25 వేల వరకు చిన్న మొక్కలను పార్కులతో పాటు నిర్దేశించిన ప్రాంతాల్లో నాటే యోచనలో ఉన్నారు. మరో 15-20 వేల వరకు నివాసితులకు పంపిణీ చేసి ఎలాగైనా 50 వేల టార్గెట్‌ను చేరుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకోవైపు ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో సైతం మరో 50 వేల వరకు మొక్కలు నాటాలనే యోచనలో యూబీడీ అధికారులు ఉన్నారు.

ప్రతి మొక్కనూ కాపాడుకుందాం

మొక్కలు నాటడమే కాదు..వాటిని కాపాడుకోవడం ముఖ్యం. దీని పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం. త్వరలో ప్రారంభం కానున్న వన మహోత్సవంలో అందరం భాగస్వాములవుదాం. నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకుందాం. ఇందుకు యూబీడీ అధికారులకు సహకారం అందించాలి. బేగంపేట సర్కిల్‌లో 50 వేల వరకు మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం.

–రాజ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్, యూబీడీ విభాగం

ఎస్ఐని వేధించిన సీఐపై చర్యలు తీసుకోవాలి


ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బన్సీలాల్‌పేట్: కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాములును వేధించి అతను ఆత్మహత్యాయత్నం చేసుకోడానికి కారకుడైన సీఐ జితేందర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ ఎస్సీ కమిషన్‌కు వినతిపత్రం సమర్పించింది. గురువారం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ కవాడిగూడలోని జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సీఐ వేధింపుల కారణంగా ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఎస్.ఐ శ్రీరాములు ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. కులం పేరిట అనేకసార్లు వేధింపులకు పాల్పడిన విషయాన్ని ఎస్.ఐ శ్రీరాములు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంగా లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో బాధిత ఎస్.ఐ సోదరి శంకరమ్మ, పులి కల్పన, నవీన్ బాధితులు యాదమ్మ, నవీన్, రితీష్ ఉన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

రాంగోపాల్‌పేట్: ఒడిస్సా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చి విక్రయించేందుకు యత్నిస్తున్న ముగ్గురిని గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. ఒడిస్సా గజపతి జిల్లా దేకపంకకు చెందిన ఎలటేరియా పారిచ్ఛ (40), అదే ప్రాంతానికి చెందిన బుధాదేబ్ నాయక్ (44)స్నేహితులు. ఇద్దరూ కార్మికులుగా పనిచేస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి తెచ్చి హైదరాబాద్‌లో విక్రయించాలని నిర్ణయించుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన చందన్ కుమార్ స్వాల్ సింగ్ (27) నగరంలో ఉంటున్నాడు. గంజాయిని హైదరాబాద్‌కు తెస్తే తాను విక్రయించి పెడతానని చెప్పడంతో గురువారం మధ్యాహ్నం ఒడిస్సా నుంచి ఇద్దరు సికింద్రాబాద్ చేరుకున్నారు. ముగ్గురు కలిసి స్టేషన్ ఎదురుగా ఉన్న జీ-పాయింట్ హోటల్‌లో ఉండగా సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వారిని అదుపులోకి తీసుకుని 6.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

విలీనం అంశంపై ప్రజలు తగిన నిర్ణయం తీసుకోవాలి


మాట్లాడుతున్న సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: కంటోన్మెంట్ విలీనం అంశంపై ప్రజలు తగిన నిర్ణయం తీసుకోవాలని జీహెచ్ఎంసీ కన్నా బోర్డు పనితీరు మెరుగ్గా ఉందని గ్రీనరీ జంగిల్ ఉన్న బోర్డు ప్రాంతం కాంక్రీట్ జంగిల్‌గా మారే అవకాశం ఉందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా బోర్డు జీహెచ్ఎంసీలో విలీనం జరిగిందని కొందరు జబ్బలు చరుచుకుంటున్నారని నిజానికి ఎలాంటి ప్రతిపాదనలు సిద్ధం కాలేదన్నారు. విలీనం చేస్తే లాభ నష్టాలపై ఎవరికి అవగాహన లేదన్నారు. ఓ పక్క రక్షణ శాఖ బజార్లు విలీనం చేస్తామని ప్రకటిస్తున్నారని ఓ పక్క బోర్డు ఉద్యోగుల పరిస్థితి ఏంటని, స్థలాలపై ఏలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్ విలీనం అంశంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారని చెప్పారు. విలీనం జరిగితే కమర్షియల్ ఎస్టాబ్లిష్ మెంట్ పెరుగుతుందని గ్రీనరీ నశించిపోతుందన్నారు.

హుస్సేన్ సాగర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సెక్రెటరియేట్ లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. న్యూమల్లేపల్లి, గోకుల్‌నగర్‌కు చెందిన మనోహర్ (33) ఫొటో గ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. 2018లో సింధూరతో వివాహం కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 2న మద్యం తాగి భార్యతో గొడవ పడటంతో భార్య అదేరోజు హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు స్టేషన్‌కు రమ్మని ఫోన్ చేశారు. ఆ తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అదే రోజు రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మనోహర్ పింగలి వెంకయ్య విగ్రహం వద్ద హుస్సేన్ సాగర్ జలాల్లో శవమై కనిపించాడు.

బోనాల జాతరపై సమీక్ష సమావేశం


పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు, అధికారులు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేపట్టాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ సూచించారు. ఆలయ ప్రాంగణంలో పలు విభాగాల అధికారులు, ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తల మండలి ప్రతినిధులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 28,29 తేదీలలో జరిగే జాతరకు వేలాదిగా తరలివచ్చే భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ట్రాఫిక్, సీసీ కెమెరాలు, బారికేడ్లు, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, విద్యుత్ తదితర సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమీక్షలో ఈఓ మహేందర్‌గౌడ్, ధర్మకర్తల మండలి చైర్మన్ గుంటి కృష్ణ, చిలకలగూడ ఎస్‌హెచ్ఓ అనుదీప్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, జలమండలి డీజీఎం కృష్ణ, సెక్షన్‌మేనేజర్ అన్విత్, ఎక్స్ అఫీషియో సభ్యుడు, ప్రధాన అర్చకుడు తిరుమలాచార్యులు పాల్గొన్నారు.

ఉరేసుకొని బాలిక మృతి

బన్సీలాల్‌పేట్: తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ మైనర్ బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ నాగరాజు రెడ్డి కథనం ప్రకారం.. అబ్దుల్ రజాక్ కుటుంబం గతంలో బన్సీలాల్‌పేట్ ప్రాంతంలో నివాసముండేవారు. అయితే.. ఇల్లు ఖాళీ చేసి న్యూబోయిగూడకు వచ్చారు. మూడ్రోజుల క్రితం అతడి కూతురు (13) బన్సీలాల్‌పేట్‌కు వెళ్లి అక్కడ పాత స్నేహితులతో కలిసి ఆడుకొని ఇంటికి వచ్చింది. అంతదూరం వెళ్లి రావడంపై తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన బాలిక తల్లితో మాట్లాడం మానేసింది. గురువారం ఓ గదిలో కెళ్లి తలుపులు వేసుకుంది. బలవంతంగా తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూసేసరికి ఉరేసుకొని ఉంది. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఓయూ బంద్ సంపూర్ణం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బంద్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం వివిధ సంఘాలతో ఏర్పడిన ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నీట్, యూజీసీ ప్రశ్న పత్రాల లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చారు. క్యాంపస్‌లోని కాలేజీలు, కార్యాలయాలను మూసివేశారు. ఎన్‌టీఏను రద్దుచేసి నీట్ అవకతవకలపై విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

బస్సు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి

సనత్‌నగర్: ఆర్టీసీ బస్సు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మూసాపేట ఆంజనేయనగర్‌లో ఉండే తోట విష్ణుప్రభ (58) చిలకలగూడలోని రైల్వే మెడికల్ స్టోర్‌లో ఉద్యోగిగా పని చేస్తుంటాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని మూసాపేటలోని ఇంటికి తన బైక్‌పై బయలుదేరాడు. టివోలి థియేటర్ సమీపంలోకి రాగా హైదరాబాద్ నుంచి బోధన్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 16జెడ్ 0285) ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు చంద్రకిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సాయిబాబాగౌడ్, అంజనీదేవి

సనత్‌నగర్: ఈ నెల 6న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించనున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం ఈ నెల 9న నిర్వహించనున్న నేపథ్యంలో కల్యాణానికి హాజరు కావాలని గురువారం నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..దేవాదాయ, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్, ఆర్ అండ్ బీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు తదితర శాఖలకు చెందిన అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లపై పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. అమ్మవారి కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని శాఖల ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈఓ అంజనీదేవి, కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు హన్మంతరావు, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ ఉన్నారు.

వాకర్స్‌కు అండగా ఉంటా..


ఎమ్మెల్యేతో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

బన్సీలాల్‌పేట్: పద్మారావునగర్ పార్కు సమగ్రాభివృద్ధితో పాటు వాకర్స్‌కు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే తలసాని అన్నారు. పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అందరి సహకారంతో పార్కును మరింత అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ లాయక్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, సలహాదారులు జీకే రావు, క్రిష్ణారావు, నిరంజన్ రావు, చంద్రశేఖర్‌లతో పాటు పార్కు కమిటీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటరమణ, రాము, రాజు, చారీ, సూర్యప్రకాష్, మధుసూదన్‌రెడ్డి, గిరి పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన సూర్యకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ1.20 లక్షల ఎల్‌ఓసీ చెక్కును గురువారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందజేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో విఫలమైందని బీజేపీ మహంకాళి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత ఆరోపించారు. గురువారం జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మారేడుపల్లి మండల కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2,500, కల్యాణ లక్ష్మి పథకంలో భాగంగా తులం బంగారం కూడా ఇవ్వాలన్నారు. అదే విధంగా 18 సంవత్సరాలు నిండిన కాలేజీకి వెళ్లే ప్రతీ ఆడపిల్లకు స్కూటీ, ఐదు లక్షల విద్యార్థి హామీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో మేకల సారంగపాణి, నాగేశ్వర్‌రెడ్డి, లలిత, అనూష, వైశాలి, కళావతి, సరోజ, శారత, లక్ష్మి, మంజూల, సుచరిత, పోచయ్య, భిక్షపతి, సాయి, రాము ఉన్నారు.

ఆలయానికి ఎమ్మెల్యే రూ.7 లక్షల విరాళం


పంచరంగుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతరను పురస్కరించుకుని ఆలయానికి పంచరంగులు వేసేందుకు అవసరమైన రూ.7 లక్షలను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ విరాళంగా అందించారు. పంచరంగుల కార్యక్రమాన్ని గురువారం ఆలయ ప్రాంగణంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే బోనాల జాతరను ఘనంగా నిర్వహించే సంప్రదాయం, ఆలయాలకు నిధుల కేటాయించే పద్ధతిని ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని, రూ. 40 లక్షల వ్యయంతో అదనపు స్థలాన్ని సమకూర్చామని వివరించారు. రాజకీయాలకు అతీతంగా బోనాల జాతరను జరుపుకోవాలన్నారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, చైర్మన్ గుంటి కృష్ణ, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు, బీఆర్ఎస్ నాయకులు రాజుసుందర్, సుంకు రాంచందర్, మహేందర్, సాయియాదవ్, రాజేష్, దేవేందర్ పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి


వివేకానందుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: తన ఉపన్యాసాలతో భారత జాతిని జాగృతం చేసిన మేధావి వివేకానందుడిని ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. వివేకానందుడి వర్ధంతి సందర్భంగా గురువారం లాలాపేట బొడ్రాయి సమీపంలోని వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించారు.

- సికింద్రాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. యువతకు ఆయన బోధనలు ఎంతో స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మజీ, రవి, రామ్‌లీలా, వరలక్ష్మీ, శేఖర్‌గౌడ్, వెంకట్, మున్నా పాల్గొన్నారు.

సమన్వయం లేక.. పనులు సాగక!



జీహెచ్ఎంసీ, జలమండలి సమన్వయ లోపంతో మురుగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీ నుంచి ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌కు వెళ్లే మార్గంలో కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య ఉంది. మురుగునీటిని పైప్‌లైన్ల ద్వారా మళ్లించేందుకు ఆరు నెలల క్రితం ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరయ్యాయి. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పనులు చేయడానికి వీలు లేకుండా పోయింది. దీంతో తమ పనులకు ఆటంకం కలిగిస్తున్న డ్రైనేజీ మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కోరినప్పటికీ వారు స్పందించడం లేదు. డ్రైనేజీని శుభ్రం చేయించి మురుగునీటి ప్రవాహాన్ని ఆపేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని జీహెచ్ఎంసీ సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీంతో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయ లోపం కారణంగా పనులు నిలిచిపోయాయి. ఇరు శాఖల అధికారుల సమన్వయలోపం ప్రజలకు శాపంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –అడ్డగుట్ట